క్లుప్తంగా

పరామర్శ



వెంకటరమణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

గుర్ల: మండల కేంద్రం గుర్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మంత్రి వెంకటరమణ తండ్రి వెంకటప్పడు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు గుర్లలోని వెంకటరమణ ఇంటికి బుధవారం వచ్చి పరామర్శించారు. వెంకటప్పడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష ఆర్థిక సహకారం



కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయానికి విజయవాడకు చెందిన డి.సుదర్శనరావు, అన్నపూర్ణేశ్వరమ్మ దంపతులు రూ.1,00,116 విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణానికి దాతల ఆర్థిక సహకారం కోసం విజయవాడ వెళ్లిన ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అప్పికొండ ఆదిబాబు,శ్రీనివాసరావు, దాసరి రవి, ఒమ్మి రమేష్‌కు దాతలు నగదు అందజేశారు.

240 ఎకరాల్లో పంట నష్టం

బొండపల్లి: ఇటీవల ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షాలకు గజపతినగరం, బొండపల్లి మండలాల్లో మొక్కజొన్న పంటకు తీవ్రనష్టం వాటిల్లినట్టు గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.మహరాజన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి గజపతినగరం మండలంలో 198 ఎకరాల్లో, బొండపల్లి మండలంలో 42 ఎకరాల్లో పంటనేలమట్టమైనట్టు గుర్తించారని పేర్కొన్నారు. పంట నష్టం నివేదికలను ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

బొండపల్లి: జగనన్న లేఅవుట్లతో పాటు సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహలబ్ధిదారులకు ఎంపీడీఓ ఏ.వేదవతి సూచించారు. దేవుపల్లిలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను బుధవారం ఆమె పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ చివరిదశకు వచ్చే నిర్మాణాలను వచ్చే నెల 15 నాటికి శతశాతం పూర్తి చేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి పందిరి రాట



కెల్లలో పందిరిరాట పూజలో సూర్యనారాయణరాజు దంపతులు

గుర్ల: శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణానికి మండలంలోని కెల్ల, గుర్ల, దమరసింగి, పెనుబర్తి, పకీరుకిట్టాలి, గుజ్జింగివలస గ్రామాల్లో బుధవారం పందిరిరాట వేశారు. కెల్ల రామాలయం వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు దంపతులు పందిరిరాట కార్యక్రమంలో పాల్గొన్నారు. సీతారాముల కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీలు తెలిపాయి.

ముగిసిన శిక్షణ

చీపురుపల్లిరూరల్: చెత్త నుంచి సంపద తయారీకేంద్రాల(ఎస్‌డబ్ల్యూపీసీ) నిర్వహణపై కర్లాంలోని ఎస్‌డబ్ల్యూపీసీలో అయిదు రోజులుగా బొబ్బిలి మండలం పారాది, రామభద్రాపురం మండలం నాయుడువలస,బూసాయవలసకు చెందిన సర్పంచులు,ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చిన శిక్షణ బుధవారంతో ముగిసింది. శిక్షణ ముగింపు సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వర్మీకంపోస్టును తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం వస్తుందని చెప్పారు. తడి,పొడి చెత్తను వేరు చేసే విధానాలను వివరించారు. ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలి రెడ్డి శిరీష, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి,సర్పంచ్ బాణాన భాగ్య లక్ష్మి, ఎంపీటీసీ బాణాన రామరత్నం పాల్గొన్నారు.

ఆసరా సంబరాలకు స్థల పరిశీలన

దత్తిరాజేరు: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న వైఎస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమానికి ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, వెలుగు ఏపీఎం అచ్యుతరావు బుధవారం స్థల పరిశీలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి బొత్స సత్యనారాయణ, కలెక్టర్ సూర్యకుమారి,ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సంబరాలకు హాజరవుతారని చెప్పారు. మండల నాయకులు మహదేవ్ ఫణీంద్రుడు, రెడ్డి సింహాచలం పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక ఆసరా

- వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అప్పలనరసయ్య



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు



మహిళలకు చెక్ అందజేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అప్పలనరసయ్య తదితరులు

గజపతినగరం: మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు మహిళల ఆర్థిక ప్రగతికి ఆసరాగా నిలుస్తున్నాయని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలను వెలుగు ఏరియా కో– ఆర్డినేటర్ జె.లక్ష్మునాయుడు, వెలుగు ఏపీఎం యు.జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీ బెల్లాన మాట్లాడుతూ సీఎం జగన్ మహిళలకు అన్నిరంగాల్లోనూ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదును అధికశాతం మహిళల ఖాతాల్లోనే జమచేస్తూ వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. డ్వాక్రా సంఘాల రుణాలను మాఫీ చేస్తామని 2014 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారని, తర్వాత రుణమాఫీ చేయకుండా మహిళలను మోసం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. చంద్రబాబు రుణమాఫీ చేయక పోవడం వల్ల డ్వాక్రా సంఘాలు అప్పుల్లో కూరుకుపోయాయని, సున్నావడ్డీ పథకాన్ని సైతం ఎగ్గొట్టారని మండిపడ్డారు. 2019 ఎన్నికల నాటికి డ్వాక్రా సంఘాలకు ఉన్న రుణాల మొత్తాన్ని నాలుగు విడతల్లో అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేస్తామని జగన్ హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఇప్పటికే మూడు విడతలకు సంబంధించిన నగదు మొత్తాన్ని విడుదల చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్వాక్రా సంఘాల మహిళలకు ఆసరా పథకం కింద మూడు విడతల్లో రూ. 19,178 కోట్లు అందించారని చెప్పారు.

ప్రతీ కుటుంబానికి ఆర్థిక భరోసా

ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని అన్నారు. చదువుతోనే కుటుంబాలు బాగుపడతాయని, పేదపిల్లలు కూడా ఇంగ్లిష్ మీడియంలో చదువుకోవాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలు చేస్తున్నారని చెప్పారు. జిల్లాలో గిరిజన యూనివర్సిటీ, గజపతినగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, స్థానిక ఆస్పత్రిని 100 పడకల స్థాయికి అప్‌గ్రేడ్ చేయడంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే పచ్చ మీడియాకు అవి కనిపించడం లేదని మండిపడ్డారు. ఉన్నదిలేనట్లు, లేనివి ఉన్నట్లు పచ్చమీడియా తప్పుడు కథనాలు, విషపురాతలు రాస్తోందని అన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం మహిళలు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ గార తవుడు, ఏఎంసీ చైర్మన్ ముత్యాలనాయుడు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఆదినారాయణ, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఎస్.పైడిరాజు, సీనియర్ నేతలు బెల్లాన త్రినాథరావు, సురేష్, పల్లి సంజీవరావు, రేగ సురేష్, వైస్ ఎంపీపీ గెద్ద దమయంతి, ఎంపీటీసీలు కర్రి కళావతి, రేగలత, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న ఎస్బీసీసీ జిల్లా కో- ఆర్డినేటర్ రామకృష్ణ

బొండపల్లి: ఆరోగ్యానికి హాని చేసే జంక్ ఫుడ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి (ఎస్బీసీసీ) బి.రామకృష్ణ సూచించారు. జంక్ ఫుడ్‌తో కలిగే అనర్థాలు, లింగవివక్షపై మండలంలోని గరుడుబిల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నారని, ఈ సమస్యకు పౌష్టికాహారంతో చెక్ చెప్పవచ్చని అన్నారు. రక్తహీనత నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని, ప్రభుత్వ స్కూళ్లల్లో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారని చెప్పారు. లింగ వివక్షతను రూపుమాపాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపైనా ఉందన్నారు. హెచ్ఎం బాబులాల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హోరా హోరీగా బార్ అసోసియేషన్ ఎన్నిక



ఎన్నికైన ఎస్.కోట బార్‌అసోసియేషన్ కార్యవర్గం

శృంగవరపుకోట: ఎస్.కోట బార్ అసోసియేషన్ ఎన్నిక బుధవారం హోరాహోరీగా జరిగింది. సీనియర్ న్యాయవాది ఎం.దుర్గాప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన బార్ అసోషియేషన్ ఎన్నికల్లో 44 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో అల్లు సత్యాజీ ప్యానెల్ విజయం సాధించింది. 23న నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నాటి నుంచి 29వరకూ ప్రచారం నిర్వహించారు. సుమారు 50 ఏళ్ల ఎస్.కోట కోర్టు చరిత్రలో తొలిసారిగా బార్‌అసోసియేషన్ ఎన్నిక పోటాపోటీగా సాగింది. అధ్యక్షుడిగా అల్లు సత్యాజీ (24–19) అయిదు ఓట్లు ఆధిక్యంతో వరుసగా రెండో సారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా డబ్ల్యూ నరసింహశర్మ(23–20) మూడు ఓట్ల తేడాతో విజయం సాధించారు. మిగిలిన స్థానాల కోసం అల్లు సత్యాజీ ప్యానెల్ అభ్యర్థులే నామినేషన్ వేయడంతో ఉపాధ్యక్షుడిగా బి.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా వి.రమణ, లైబ్రరీ కార్యదర్శిగా ఆర్.సత్యనారాయణ, ట్రెజరర్‌గా బి.త్రిమూర్తులు, కార్యవర్గ సభ్యులుగా టి.వి.ఆర్.మూర్తి, పిడిది రామకృష్ణ, నెక్కల సత్యనారాయణ, బి.సత్యనారాయణ, మీడియా సెక్రటరీగా బి.వి.ఎస్.రామారావు ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన న్యాయవాదుల సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణిని కలిశారు. బార్‌అసోసియేషన్ సభ్యులను ఆమె అభినందించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని బుధవారం జెండా ఊపి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ్మర్ క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా ప్రతీ గ్రామంలో తాగునీటి బోర్లను తనిఖీ చేయాలని, ఎక్కడైనా బోర్లు పాడైతూ మరమ్మతులు చేయాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, వెలుగు ఏపీఎం ఎం.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లిరూరల్(గరివిడి): వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా బోర్లకు మరమ్మతు లు చేసేందుకు క్రాస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివా సరావు అన్నారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గోవింద్, సిబ్బంది పాల్గొన్నారు.



చీపురుపల్లిరూరల్(గరివిడి): క్రాస్ పొగ్రాం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ శ్రీనివాసరావు

మౌలికవసతులకు అధిక ప్రాధాన్యం



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ సుధారాణి, వంశీకృష్ణ

చీపురుపల్లి: వీధులు, వార్డుల్లో మౌలిక వసతులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి జి.అగ్రహారం ప్రధాన వీధిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.15 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులకు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తనయుడు వంశీకృష్ణతో కలిసి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి తిరుమల, కర్రోతు రమణ, కొసిరెడ్డి రమణ, రౌతు పైడిరాజు, మహేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

రాములోరి పెళ్లికి అక్షర తలంబ్రాలు



'శ్రీరామ'అక్షరాలతో ఉన్న తలంబ్రాలు

శృంగవరపుకోట: రఘుకుల తిలకుడు రామచంద్రుని కల్యాణోత్సవానికి ఊరూరా వేదికలు సిద్ధమయ్యాయి. ఎస్.కోటబ్రాహ్మణ వీధిలో కోదండ రామాలయంలో గురువారం సాయంత్రం 5గంటలకు, చింతావీధిలోని రామాలయంలో 8 గంటలకు, వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం 10.30గంటలకు, గౌరీనగర్‌లో అభయాంజనేయ స్వామి ఆలయంలో 11గంటలకు, గవరపాలెంలో ఇటీవల నూతనంగా నిర్మించిన రామాలయంలో ఉదయం 10.30 గంటలకు సీతారాముల కల్యాణోత్సవాన్ని జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. గవరపాలెం రామాలయంలో స్వామి కల్యాణోత్సవం కోసం 'శ్రీరామ' అక్షరాలు లిఖించిన తలంబ్రాలు బియ్యం ప్రత్యేకంగా సిద్ధం చేశామని ఆలయ నిర్వాహక కమిటీ సభ్యుడు కృష్ణ తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



వేపాడ: సోంపురం ఉన్నతపాఠశాలలో విద్యార్థుల పిరమిడ్ ప్రదర్శన

గుర్ల: కలవచర్ల ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాల చేస్తూ సందడి చేశారు. అతిథిగా హాజరైన జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు పదోతరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు.ఎంఈఓ ఎస్.భానుప్రకాష్, సర్పంచ్ యడ్లగోపి, స్థానిక నాయకుడు బోళ్ల సుబ్రహ్మణ్యం, హెచ్ఎం కృష్ణ పాల్గొన్నారు.

సోంపురంలో..

వేపాడ: సోంపురం ఉన్నతపాఠశాలలో పదోతరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుకలను హెచ్ఎం బాలభాస్కరరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. విద్యార్థుల నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమం



కొత్తవలస: మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



గజపతినగరం రూరల్: వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

కొత్తవలస/ గజపతినగరం రూరల్: అర్హతే ప్రామాణికంగా, పార్టీలకు అతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎస్.కోట, గజపతినగరం ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనరసయ్య అన్నారు. కొత్తవలస మేజర్ పంచాయతీ సచివాలయం–4 పరిధి రామచంద్రపురం,గవరపాలెం గ్రామంలో ఎమ్మెల్యే కడుబండి, గజపతినగరం మండలంలోని మర్రివలస గ్రామంలో ఎమ్మెల్యే అప్పల నరసయ్య బుధవారం 'గడపగడపకు మనప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు.

రూ.8 లక్షల సీఎం సహాయ నిధి అందజేత



బాధిత కుంటుంబానికి సీఎం సహాయ నిధి చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీకి చెందిన జిడ్డు సరస్వతికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.8 లక్షల చెక్‌ను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కొత్తవలసలోని తన క్యాంపు ఆఫీస్‌లో బుధవారం అందజేశారు. తుమ్మికాపల్లి పంచాయతీ పరిధిలో గతేడాది గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో చికిత్స పొందుతూ జిడ్డు సత్యంనాయుడు మృతి చెందారు. అప్పటి నుంచి ఆయన భార్య సరస్వతి అనారోగ్యంతో మంచం పట్టింది. విశాఖపట్నంలోని ఆస్పత్రిలో లక్షల రూపాయలు వెచ్చించి చికిత్స తీసుకుంది.ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని బాధిత కుటుంబ సభ్యులు గ్రామ సర్పంచ్ విరోతి కొండలరావు ద్వారా ఎమ్మెల్యే కడు బండి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన తక్షణమే స్పందించి బాధితురాలు సరస్వతి చికిత్సకు సంబంధించిన పత్రాలతో ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫా ర్సు చేశారు. దీంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.8 లక్షలు మంజూరయ్యింది. కొత్తవలస,ఎల్.కోట ఎంపీపీలు నీలంశెట్టి గోపెమ్మ, గేదెల శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు,తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల వివరాలు తేల్చండి



అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమైన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: చీపురుపల్లి నియోజకవర్గంలోని మెరకముడిదాం, చీపురుపల్లి, గరివిడి మండలాల్లో అసైన్డ్ భూమి ఎంత ఉందో తేల్చాలని ఆ మండలాల తహసీల్దార్ లకు జెడ్పీ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో చీపురు పల్లి ఆర్డీఓ ఎం.అప్పారావు, మెరకముడిదాం, చీపురుపల్లి, గరివిడి, మండ లాల తహసీల్దార్లు, ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా ఎన్ని ఎకరాల అసైన్డ్ ల్యాండ్‌ను గుర్తించారు, ఎంతమంది రైతులు సాగుచేస్తున్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఏ రైతు కూడా తన సాగుభూమికి అధికారులు పట్టా ఇవ్వలేదని అనకుండా ఉండేలా రైతుల సాగులో ఉన్న భూములన్నింటికీ యుద్ధప్రాతిపదికన పట్టాలు సిద్ధం చేయాలన్నారు. తహసీల్దార్‌లు బి.రత్నకుమార్, టి.గోవింద్, ఎం.సురేష్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, ఇప్పిలి అనంత్, మీసాల విశ్వేశ్వరరావు, శ్రీరాములునాయుడు, ముల్లు రాంబాబు, గేదెల ఆదిబాబు, మూడు మండలాల సర్వేరయర్లు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తవలస: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 31వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ డీఈ బి.వెంకటరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో చింతలపాలెం,దేసపాత్రునిపాలెం,తాడివానిపాలెం,దెందేరు, గనిశెట్టిపాలెం, గులివిందాడ, మిందివలస, ఎం.ఆర్.పురం గ్రామాలకు 31వ తేదీన ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పదోన్నతి ఉత్తర్వులు అందజేత

మెరకముడిదాం: మండలంలోని బోడెందొరవలస గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న గురాన ధనలక్ష్మికి సూపర్‌వైజర్‌గా పదోన్నతి రావడంతో అక్కడ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఖాళీ అయ్యింది. దీంతో ఆ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న లెంక రమ కార్యకర్తగా పదోన్నతి పొందారు. సంబంధిత ఉత్తర్వులను రమకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు బుధవారం అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బూటు శ్రీదేవి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు అభినందన



విజేతలకు మెమెంటోలు అందజేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు

శృంగవరపుకోట: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణ పరిధి పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులకు గతనెల 18న నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన విజేతలను బుధవారం ప్రకటించారు. కె.వైష్ణవి(నారాయణ స్కూల్) ప్రథమస్థానం,వి.హన్సిక(రవీంద్రభారతి స్కూల్) తనూజ (నారాయణస్కూల్)ద్వితీయ స్థానం, కె.రేష్మ(శ్రీరవితేజ స్కూల్), చరణ్(సర్వేపల్లి స్కూల్), ఎ.రోహిత్(రవీంద్రభారతి స్కూల్) తృతీయ స్థానం, కె.భారతి, పి.భవ్యశ్రీ(ఉన్నత పాఠశాల) ఎం.రోషిణి(గౌరీవిద్యానికేతన్) నాలుగో స్థానం సాధించారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.సన్యాసిపాత్రుడు చెప్పారు. విజేతలకు ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేసి, అభినందించారు.

ఆసరా సంబరాలను విజయవంతం చేయాలి

చీపురుపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 31న మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్న వైఎస్సార్ ఆసరా సంబరాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, వెలుగు ఏసీ సీతారామయ్య కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో వెలుగు సిబ్బంది, మండలసమాఖ్య ప్రతినిధులతో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడుతో కలిసి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబరాలకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరవుతున్నట్లు చెప్పారు. గ్రామైక్య సంఘాలు, స్వయంసహాయక సంఘ సభ్యులు హాజరయ్యేలా వెలుగుసిబ్బంది చూసుకోవాలన్నారు. వెలుగు ఏపీఎం ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

చక్కని భవిష్యత్‌కు పదోతరగతి పునాది

చీపురుపల్లి: విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో ఉండాలంటే పదో తరగతిని గట్టి పునాదిగా భావించాలని డిప్యూటీ డీఈఓ కంది వాసుదేవరావు చెప్పారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలంటే భయాన్ని వీడి ప్రశాంతంగా రాయాలని సూచించారు. హెచ్ఎం శ్యామలసాయి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో దగ్ధమైన దుకాణం పరిశీలన

దత్తిరాజేరు: కొద్దిరోజుల క్రితం వంగర గ్రామం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు మజ్జి అప్పలనాయుడుకు చెందిన ఎలక్ట్రికల్ షాపు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఆ దుకాణాన్ని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య బుధవారం పరిశీలించారు.అగ్ని ప్రమాదానికి గల కారణాలను బాధితుడిని అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవించిందని, రూ.13 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు ఉన్నారు.